సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం । 1 । సెప్టెంబర్ । 2025





**సుజల ప్రాప్తిరస్తు..**

అన్నవరం దేవస్థానంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వర్షపు నీటిని వినియోగించుకునేలా రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.

8లో



**పెట్టుబడి పెన్షన్.. బతుకు టెన్షన్**

సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలనే డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది. వీరి పోరాటానికి ఫ్యాప్టో ఇప్పటికే మద్దతు పలికింది.

8లో

**విలక్షణానికి ప్రతీకలు ముువ్వురు తల్లులు**



కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన రామాయణ కల్పవృక్షంలో ముువ్వురు తల్లులు మూడు రకాల స్వభావాలకు ప్రతీకలుగా నిలుస్తారని శతావధాని డాక్టర్ బులుసు అపర్ణ అన్నారు. రాజమహేంద్రవరంలో సరస్వతీ సపర్యా మహోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్


### 7న అంతర్వేది ఆలయం మూసివేత

సఖినేటిపల్లి: సంపూర్ణ చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకుని అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయాన్ని ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నం నుంచి మూసివేయనున్నట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భాద్రపద పూర్ణిమ సందర్భంగా ఆ రోజు రాత్రి 9–50 గంటల నుంచి అర్ధరాత్రి 12–24 గంటల వరకూ చంద్రగ్రహణం ఉంటుందన్నారు. దీనితో మధ్యాహ్నం 1 గంట నుంచి ఆలయాన్ని మూసివేస్తామని, తిరిగి మర్నాడు 8న ఉదయం 8 గంటల నుంచి యథావిధిగా భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తామన్నారు. 8వ తేదీ వేకువ జామున నిర్వహించాల్సిన ఆర్జిత అభిషేకం రద్దు చేసినట్టు వెల్లడించారు.

### నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

అమలాపురం రూరల్: జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదికను అమలాపురంలోని కలెక్టరేట్ గోదావరి భవన్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తామని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజనల్ అధికారుల కార్యాలయాల్లో, మండల తహసీల్దార్, ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో గ్రీవెన్స్ జరుగుతుందన్నారు.

### ఏలేరులో పెరిగిన నీటినిల్వలు



ప్రాజెక్టులో ప్రస్తుత నీటినిల్వలు

ఏలేశ్వరం: ఏలేరులో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ఆదివారం ప్రాజెక్టులోకి 1.708 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. సీతానగరం మండలం పురుషోత్తపట్నం నుంచి 1.050 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 86.46 మీటర్లకు 80.74 మీటర్లు, 24.11 టీఎంసీలకు 14.26 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. దీంతో ఆయకట్టుకు 1500, విశాఖకు 200 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. తిమ్మరాజుచెరువుకు నీటి విడుదల నిలిపివేశారు.

### అన్నదానం, గో సంరక్షణకు రూ.2.5 లక్షల విరాళం



దేవస్థానం చైర్మన్‌కు చెక్కులను ఇస్తున్న సూర్యనారాయణ, ఉదయ్ శర్మ

అన్నవరం: సత్యదేవుని వ్రత విభాగంలో పనిచేస్తున్న కర్రి సూర్యనారాయణ (నాని) తన కుమారుడు సత్యగౌరీ ఉదయ్ శర్మకు ఉద్యోగం వచ్చిన సందర్భంగా సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష, గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.1.50 లక్షలు విరాళాన్ని దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్‌కు ఆదివారం అందచేశారు. ఏటా ఆషాఢ బహుళ ఏకాదశి నాడు, అన్నదానం, గోపూజ చేయాలని కోరారు.

### ఆకట్టుకున్న పురాతన నాణేలు



బోట్‌క్లబ్ ఉద్యానవనంలో పురాతన నాణేలు, విదేశీ కరెన్సీ ప్రదర్శిస్తున్న రాజేశ్వరరావు

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్ వద్ద బోట్ క్లబ్ ఉద్యానవనంలో గ్రంథాలయం వద్ద వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో వద్దిపర్తి రాజేశ్వరరావు పురాతన నాణేలు, వివిధ దేశాల కరెన్సీ నోట్లను ఆదివారం ప్రదర్శించారు. దేశంలో 18, 19 శతాబ్దాల నాటి వెండి నాణేలు, దమ్మిడీలు, చిల్లు కాసులు, రాగి నాణేలు, అర్ధణాలు, అణాలు, బేడలు, పావలా నాణేలతో పాటు 72 దేశాలకు చెందిన నాణేలు, కరెన్సీని ప్రదర్శించారు. ఈ సందర్భంగా నాణేలు సేకరణ కర్త రాజేశ్వరరావు మాట్లాడుతూ నాణేల సేకరణను అలవాటుగా మార్చుకున్నట్టు తెలిపారు. దేశంలో వినియోగించి ప్రస్తుతం వినియోగంలో లేని నాణేల పట్ల నేటి యువతకు అవగాహన కల్పించడం తన ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌సీఐ మాజీ జీఎం ప్రసాద్ నాయుడు పాల్గొన్నారు.

# ఆగని జలగాటం..

- లంకలకు మళ్లీ ముంపు బెడద
- నీట మునిగిన కాజ్‌వేలు
- పడవలపైనే రాకపోకలు
- నానుతున్న పంటలు



పి.గన్నవరం మండలం బూరుగులంక రేవులో పడవపై లంక గ్రామాల ప్రజల రాకపోకలు



పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వరద ఉధృతి

సాక్షి, అమలాపురం: గోదావరి వరద వదలనంటోంది.. జిల్లాలో లంక ప్రాంతాలను మళ్లీ ముంచెత్తుతోంది.. కాస్త తగ్గిందనుకునే లోపే తిరిగి ఉధృతంగా మారుతోంది.. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయగా, లంక గ్రామాల్లో ఇప్పటికే కాజ్‌వేలు, లోతట్టు ప్రాంతాల రోడ్లపైకి ముంపునీరు చేరింది. దీంతో లంక వాసులు ప్రత్యామ్నాయ విధానాల్లో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. సోమవారానికి ముంపు తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉండటంతో ప్రజలను కలవరపాటుకు గురిచేస్తోంది.

ధవళేశ్వరం బ్యారేజీకి వరద నీటి ప్రభావం పెరుగుతుండడంతో దిగువకు జలాల విడుదల ఆదివారం మరింత పెరిగింది. ఇక్కడ మొదటి ప్రమాద హెచ్చరిక విడుదల చేశారు. ఉదయం ఆరు గంటలకు 10,81,115 క్యూసెక్కుల నీరు విడుదల చేయగా, తొమ్మిది గంటలకు 10,94,575 క్యూసెక్కులు, మధ్యాహ్నం 12 గంటలకు 11,16,464 క్యూసెక్కులు, మూడు గంటలకు 11,24,472 క్యూసెక్కులు, సాయంత్రం ఆరు గంటలకు 11,35,249 క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల చేశారు. అయితే సాయంత్రం ఐదు గంటల నుంచి వరద నిలకడగా ఉంది. ఎగువన భద్రాచలం వద్ద వరద తగ్గుముఖం పట్టడంతో దిగువన కూడా వరద తగ్గుతోంది. ఎగువన తగ్గుతున్నా దిగువన లంకల్లో మాత్రం వరద ముంపు పెరుగుతోంది. జిల్లాలో పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి మండలాల్లో వరద ఉధృతి అధికంగా ఉంది. ముమ్మిడివరం, ఐ.పోలవరం, కె.గంగవరం, కాట్రేనికోన, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో సోమవారం నుంచి వరద ప్రభావం పెరగనుంది.

**ఎక్కడెక్కడ ఎలా అంటే..**

- మామిడికుదురు మండలం అప్పనపల్లి కాజ్‌వే నీట మునిగింది. దీనిపై మూడు అడుగుల ఎత్తులో నీరు ప్రవహిస్తోంది. దీనివల్ల అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. కాజ్‌వే మీదుగా రాత్రి నుంచి రాకపోకలు నిలిపివేశారు. లంక వాసులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు.
- పి.గన్నవరంలో వరద ఉధృతి మరింత పెరిగింది. తాజాగా మానేపల్లి నుంచి శివాయలంకకు వెళ్లే రెండు కిలోమీటర్ల మేర రోడ్డు నీట మునిగింది. తాము రాకపోకలు సాగించేందుకు వీలుగా ట్రాక్టర్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. కనకాయలంక కాజ్‌వే మరింత ముంపు బారిన పడింది.
- అయినవిల్లి మండలం ముక్తేశ్వరం వద్ద ఎదురుబిడెం కాజ్‌వే నీట మునిగింది. దీంతో అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, కపిలేశ్వరపురం మండలం అద్దంకివారిలంక వాసులు పడవలపై రాకపోకలు సాగించాల్సి వస్తోంది. పాడి రైతులు, విద్యార్థులు, మహిళలు ఇబ్బంది పడుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లోని లంక పొలాల్లోకి వరద నీరు చేరింది.
- ఐ.పోలవరం మండలం అన్నంపల్లి అక్విడెక్ట్‌తో పాటు, రాఘవేంద్ర వారధి, ఎదుర్లంక వారధి వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎదుర్లంక, జి.మూలపొలం, గుత్తెనదీవిల వద్ద ఏటిగట్టు దిగువన ఉన్న లంకల్లోకి వరద చొచ్చుకు వస్తోంది. దిగువన లంకల్లో నీరు ప్రవహిస్తోంది.



అప్పనపల్లి కాజ్‌వేపై ముంపు నీరు

- ముమ్మిడివరం మండలం గురజాపులంక, కూనాలంకల్లోకి వరద నీరు ప్రవేశిస్తోంది. గురజాపులంకకు వెళ్లే రహదారి నీట మునగనుంది. కాట్రేనికోన మండలం పల్లంకుర్రు రేవు, భైరవపాలెం లంకల్లో లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు వస్తోంది.

**మూడోసారి వచ్చి.. ముంచేసి**

గోదావరికి గడిచిన రెండు నెలల్లో మూడో సారి వరద వచ్చింది. లోతట్టు ప్రాంతాల్లోని పంట చేలు, తోటలు ముంపు బారిన పడుతున్నాయి. దీర్ఘకాలిక పంటలైన కొబ్బరి, కోకో, పోక వంటి పంటలకు నష్టం లేకున్నా అరటి, బొప్పాయి, కంద, పసుపుతో పాటు కూరగాయ పంటలకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లుతోంది. జూలైలో ఒకసారి, ఆగస్టులో రెండుసార్లు వరద వచ్చిన విషయం తెలిసిందే. జిల్లా వ్యాప్తంగా సుమారు 700 ఎకరాల్లో అరటి, పసుపు, కంద, బొప్పాయి, కూరగాయ పంటలు నీట మునిగి దెబ్బతిన్నాయని అంచనా. ప్రభుత్వం పరిహారం అందించాలని రైతులు ఎదురు చూస్తున్నారు. కానీ ఇంత వరకూ ప్రభుత్వం నుంచి పరిహారంపై ప్రకటన విడుదల కాకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### నేడు పాఠశాలలకు సెలవు

పి.గన్నవరం: వరదల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పి.గన్నవరం మండలం ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల్లో పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించినట్టు ఎంఈఓ కోన హెలీనా తెలిపారు. అలాగే పి.గన్నవరం మండలంలోని లంక గ్రామాలతో పాటు, పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు వస్తున్న 327 మంది విద్యార్థులకు కూడా సెలవు ఇచ్చారన్నారు. లంక గ్రామాల నుంచి విద్యార్థులను నదీ పాయలు దాటి బయటకు పంపవద్దని, ఆయా రేవులను పర్యవేక్షిస్తున్న అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్టు హెలీనా తెలిపారు.

### స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఎస్సీ విభాగంలో శ్రీలక్ష్మి ప్రథమం



భర్త కొల్లి రమేష్‌తో డీఎస్సీ ఎస్సీ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన శ్రీలక్ష్మి

రామచంద్రపురం రూరల్: ఉండూరు గ్రామానికి చెందిన వరసాల శ్రీలక్ష్మి డీఎస్సీ 2025లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు సబ్జెక్టులో 78.45 మార్కులు సాధించి, తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ గ్రూపు–3లో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచారు. దీంతో ఆమె స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయురాలిగా నియామకం పొందనున్నారు. ఆమె భర్త కొల్లి రమేష్ 2012 డీఎస్సీలో ఎస్సీ విభాగంలో జిల్లా ప్రథమ స్థానం సాధించడం విశేషం. అదే రీతిలో ఇప్పుడు భార్య కూడా నిలవడం పట్ల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. హసన్‌బాద జెడ్పీ హైస్కూల్‌లో శ్రీలక్ష్మి పదో తరగతి వరకూ చదువుకున్నారు. రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్, కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ, విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో పీజీ చదివారు. కాకినాడ నగర పాలక సంస్థ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా రమేష్ విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రణాళికగా చదివితే పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చని తెలిపారు.

### 3 నుంచి గురుకులం రజతోత్సవాలు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం శివారు కొంతమూరు గ్రామంలోని శ్రీదత్తాత్రేయ వేదవిద్య గురుకులం రజతోత్సవాలు ఈ నెల మూడో తేదీ నుంచి మూడు రోజుల పాటు గురుకుల ప్రాంగణంలో జరుగుతాయి. ఈ సందర్భంగా ప్రతిరోజూ సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటల వరకు వేదపరిరక్షణ–సర్వజగద్రక్షణం అనే అంశంపై సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ ప్రవచనాలను అందిస్తారు. ఆయా కార్యక్రమాల్లో వేద శాస్త్రాభిమానులు పాల్గొనాలని గురుకులం ప్రతినిధి దత్తాత్రేయ శర్మ ఘనపాఠి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

## టేకు రథంపై సత్యదేవుని ఊరేగింపు



ఆలయ ప్రాంగణంలో టేకు రథంపై సత్యదేవుడు, అమ్మవారిని ఊరేగిస్తున్న అర్చకులు, సిబ్బంది



సత్యదేవుని దర్శనానికి వెళ్తున్న భక్తులు

- స్వామివారిని దర్శించిన పది వేల మంది భక్తులు
- రూ.15 లక్షల ఆదాయం

అన్నవరం: రత్నగిరి వీర వేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయ ప్రాకారంలో ఆదివారం సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను టేకు రథంపై ఘనంగా ఊరేగించారు. ఉదయం పది గంటలకు ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తూర్పురాజగోపురం వద్దకు తీసుకువచ్చి రథంపై ప్రతిష్ఠించి పూజలు చేసి రథసేవ ప్రారంభించారు. వేద పండితుల మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రాగా, స్వామి, అమ్మవార్లను మూడుసార్లు ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా, ఆదివారం సుమారు పది వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. స్వామివారి సర్వదర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి శ్రీకృష్ణునికి పూజలు చేశారు. తరువాత రావిచెట్టు వద్ద ప్రదక్షిణ చేసి జ్యోతులు వెలిగించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.15 లక్షలు ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు. సుమారు నాలుగు వేల మంది భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

### రిజిస్టర్ పోస్టుకు మంగళం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): దాదాపు యాభై ఏళ్లుగా చిరపరిచితమైన రిజిస్టర్ పోస్టు సేవలు ఇక కనుమరుగు కానున్నాయి. భారత తపాలాశాఖ నేటి నుంచి రిజిస్టర్ పోస్టు సేవలను నిలిపివేస్తున్నట్లు కీలక నిర్ణయం తీసుకుంది. సేవల క్రమబద్ధీకరణ, ట్రాకింగ్ వ్యవస్థ బలోపేతం ఆధునీకరణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. తక్కువ ఖర్చుతో, అత్యంత విశ్వసనీయమైన రిజిస్టర్ పోస్టు జనం మదిలో నిలిచిపోయింది. గతంలో ముఖ్యమైన పత్రాలు, ముఖాముఖీలు, ఉద్యోగ నియామకాలు, న్యాయస్థానాల ఉత్తర్వుల ప్రతులను రిజిస్టర్ పోస్టు ద్వారా పంపేవారు. ఈ విభాగాన్ని స్పీడ్ పోస్టులోకి విలీనం చేస్తున్నట్లు తపాలాశాఖ గతంలో ప్రకటించింది. వేగవంతమైన సేవలు అందించే దిశగా ఆ శాఖ ఇటీవలే 2.0 సాంకేతికతను అందుబాటులోకి తీసుకు వచ్చింది. కాకినాడ డివిజన్ పరిధిలో ఉన్న అన్ని తపాలా కార్యాలయాల్లో స్పీడ్ పోస్టు సేవలు సద్వినియోగం చేసుకోవచ్చని పోస్టల్ సూపరింటెంట్ దాసరి నాగేశ్వరరెడ్డి తెలిపారు. వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల్లో కీలకమైన పీడీఎఫ్, ఇతర ఫైళ్లు, పత్రాలను పౌరులు నేరుగా సెకన్ల వ్యవధిలో పంపే సంస్కృతి పెరగడమే రిజిస్టర్ పోస్టుకు ఆదరణ తగ్గడానికి ప్రధాన కారణం.

## గణపతి.. అందుకో హారతి

అయినవిల్లి: జిల్లాలో గణపతి నవరాత్ర ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఈ మేరకు అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో తెల్లవారు జామున స్వామివారికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకాలు, గరిక తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. లఘున్యాస ఏకాదశ రుద్రాభిషేకాల్లో 197 మంది, పంచామృతాభిషేకాల్లో ముగ్గురు దంపతులు, లక్ష్మీగణపతి హోమంలో 45 జంటలు, గరిక పూజలో ఒక జంట పాల్గొన్నారు. ఐదుగురు తులాభారం చెల్లించగా, తొమ్మిది మంది వాహన పూజ చేయించుకున్నారు. 9,140 మంది స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ ఒక్కరోజే ఆలయానికి వివిధ విభాగాల ద్వారా రూ.6,50,102 ఆదాయం వచ్చిందని ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని తెలిపారు. చవితి ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని మూషిక వాహనంపై మాఢ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో వేద పండితులు పంచహారతులు ఇచ్చారు. ఆలయం వద్ద వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.





విఘ్నేశ్వర స్వామికి హారతి ఇస్తున్న వేద పండితులు (అంతరచిత్రం) మాఢ వీధుల్లో ఊరేగుతున్న అయినవిల్లి స్వామివారు

# అత్యుత్సాహం.. కారాదు విషాదం

- వినాయక ఊరేగింపులు, నిమజ్జనాల్లో జాగ్రత్తలు అవసరం
- నిబంధనలు పాటిస్తే అంతా సవ్యమే



లంబోదరుడిని నిమజ్జనానికి తీసుకు వెళ్తున్న భక్తులు (ఫైల్)



అమలాపురంలో నిమజ్జనం జరిగే ప్రధాన కాలువ వద్ద పరిశీలిస్తున్న పట్టణ సీఐ వీరబాబు, ఎస్సైలు కిషోర్‌బాబు, శ్రీనివాస్

రాయవరం/ అమలాపురం టౌన్: జై వినాయకా... బొజ్జ వినాయకా.. అంటూ స్వామివారిని కొలుస్తూ నిర్వహించే వేడుకల్లో మానవ తప్పిదాలతో అపశ్రుతులు చోటుచేసుకుంటున్నాయి.. గణపతి నవరాత్ర ఉత్సవాలు ముగుస్తుండడంతో నిర్వహించే నిమజ్జనోత్సవాల్లో యువత అత్యుత్సాహం మాటున ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఈ సమయంలో గోదావరి పాయలు, సముద్ర తీరాలు, పంట కాలువలు, చెరువుల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకుంటే అంతా సవ్యమే. లేకుంటే ప్రమాదమే. సాధారణంగా వినాయక నిమజ్జనోత్సవాలు విగ్రహాల ప్రతిష్ఠ అనంతరం 3, 5, 7, 9, 11వ రోజుల్లో చేస్తుంటారు. గత నెల 27న వినాయక ప్రతిష్ఠ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా వినాయక విగ్రహ నిమజ్జనాలు ప్రారంభమైనందున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

జిల్లాలో వాడవాడలా వినాయక మండపాలు ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ ద్వారా పోలీసు శాఖకు దరఖాస్తు చేసుకున్న 1,511 వినాయక మండపాలే కాకుండా చిన్నా చితికా కలిపి మరో 500 మండపాలు పెట్టారు. ఈ మండపాల నిర్వహణ కమిటీలు నవరాత్రులు ముగిశాక వినాయక విగ్రహాలను ఊరేగింపులతో నిమజ్జనాలు చేస్తాయి. ఈ సమయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసు శాఖ సూచిస్తుంది. కాలువలు, నదులు, చెరువుల్లో విగ్రహాల నిమజ్జనాల సమయంలో ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తాయి. ఈతరాని వారు నీటిలో దిగి ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఇప్పటికే అనేకం జరిగాయి. ఈ ఘటన నేపథ్యంలో జాగ్రత్తలు అవశ్యమని పోలీసు శాఖ చెబుతోంది.

**గతంలో ఎన్నో దుర్ఘటనలు**

గతేడాది వినాయక నిమజ్జనం సందర్భంగా కిర్లంపూడి మండలం వీరవరం గ్రామానికి చెందిన ఎస్.లక్ష్మణ బాబు ఏలేరు కాలువలో దిగి కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయాడు. అంతకు ముందు ఏడాది ఆలమూరు మండలం మడికిలో ఎ.రాజేష్ కాలువలో గల్లంతయ్యాడు. అదే ఏడాది బిక్కవోలు మండలం తొస్సిపూడిలో టీఎస్‌వీవీ రామారెడ్డి కాలువలో పడి మృత్యువాత పడ్డాడు. నిమజ్జన ఊరేగింపు అనంతరం తిరిగి వస్తున్న కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామానికి చెందిన కె.లోవరాజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇలా అనేక ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా ముఖ్యంగా నిమజ్జనం చేసే కాలువలు, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి.

**ఉత్సవ కమిటీలకు అవగాహన**

జిల్లాలో జరిగే వినాయక విగ్రహ నిమజ్జనోత్సవాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్పీ బి.కృష్ణారావు జిల్లా పోలీసు అధికారులకు ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారు. జిల్లాలో మూడు పోలీస్ సబ్ డివిజన్ల డీఎస్పీలు టీఎస్ఆర్‌కే ప్రసాద్ (అమలాపురం), సుంకర మురళీమోహన్ (కొత్తపేట), రఘువీర్ (రామచంద్రపురం)లు తమ తమ డివిజన్లలో వినాయక చవితి ఉత్సవాల కమిటీలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. అలాగే సీఐలు, ఎస్సైలు తమ ప్రాంతాల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేసిన కమిటీల వద్దకు వెళ్లి నిమజ్జన నిబంధనలు చెబుతున్నారు. ఆయా కమిటీలు నిమజ్జనాలు చేసే నదీపాయలు, సముద్ర తీరాలు, పంట కాలువలు, చెరువులను పరిశీలిస్తున్నారు. నిబంధనలు పాటించండి, అందరూ క్షేమంగా ఉండండి.. అంటూ పోలీసులు హితబోధ చేస్తున్నారు.

### కమిటీలదే బాధ్యత



గణేశ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులకు అవగాహన కల్పించాం. పోలీసులకు ముందస్తు సమాచారం ఇస్తే అందుకు తగిన చర్యలను తీసుకోవడానికి వీలుంటుంది. నిమజ్జనోత్సవాల్లో ప్రాణాపాయం లేకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉత్సవ కమిటీలపై ఉంది.

– బి.రఘువీర్, డీఎస్పీ, రామచంద్రపురం

### ఇలా చేస్తే మంచిది

- నిమజ్జనోత్సవ ఊరేగింపుల్లో చిన్న పిల్లలు, మహిళలు పాల్గొన్నా వారు నీటిలోకి దిగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- మద్యం తాగిన వారు ఉత్సవాల్లో పాల్గొనకుండా కమిటీలు బాధ్యత వహించాలి.
- పెద్ద విగ్రహాల ఊరేగింపుల్లో రోడ్డు వెంబడి విద్యుత్ తీగలకు తగలకుండా జాగ్రత్తలు పాటించాలి. విద్యుత్ తీగలను తప్పించుకుంటూ వెళ్లాలి. లేదా విద్యుత్ కార్యాలయాలకు ముందస్తు సమాచారం ఇవ్వాలి.
- నిమజ్జనాలు చేసే నదీ పాయలు, సముద్ర తీరాలు, పంట కాలువల వద్ద గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచుకోవాలి.
- విగ్రహ నిమజ్జన సమయంలో నీటిలోకి దిగేవారిని ముందే ఎంపిక చేసుకుని వారిని మాత్రమే నదీ పాయలు, సముద్రం, పంట కాలువలు, చెరువుల్లోకి దింపాలి. విగ్రహాన్ని వారే నెమ్మదిగా నీటిలోకి జార విడిచాలి.
- ఊరేగింపులు, నిమజ్జనం చేసే ప్రాంతాల్లో బాణసంచా కాల్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- డీజేలతో పెద్ద శబ్దాలకు చెక్ పెట్టాలి. ముఖ్యంగా నిమజ్జన ప్రాంతంలో అధిక శబ్దం వల్ల ఒకరి మాట ఒకరికి వినిపించకపోవడంతో అనర్థాలు జరిగే అవకాశం ఉంటుంది.

## క్లుప్తంగా

### సత్యదేవుని హుండీ నేడు లెక్కింపు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోని హుండీలను తెరిచి, భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించనున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి స్వామివారి నిత్యకల్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరగనుంది. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు పర్యవేక్షిస్తారు. దేవస్థానంలో హుండీ ఆదాయాన్ని గత నెల 30న లెక్కించారు. మరలా 32 రోజుల తర్వాత సోమవారం లెక్కించనున్నారు.

### బాల్ బ్యాడ్మింటన్‌లో జాహ్నవి, శ్రీలక్ష్మికి తృతీయ స్థానం



పోటీల్లో గెలుచుకున్న బహుమతులతో శ్రీలక్ష్మి, జాహ్నవి

సీతానగరం: చినకొండేపూడికి చెందిన విద్యార్థిని జాహ్నవి రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ బాలికల విభాగంలో తృతీయ స్థానం కైవసం చేసుకుంది. ఆదివారం ప్రకాశం జిల్లా చేవూరులో జరిగిన ఈ పోటీల్లో చినకొండేపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న బచ్చు జాహ్నవి, సీనియర్స్ విభాగంలో జిల్లా పరిషత్ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) ఎం శ్రీలక్ష్మి తృతీయ స్థానం సాధించారు. వీరిని స్కూల్ హెచ్ఎం ఎస్ ఉషారాణి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

### హైవేపై లీకైన ఆయిల్

వాహన చోదకులకు ఇక్కట్లు



ఆయిల్ లీకైన ప్రదేశంలో చర్యలు చేపట్టిన హైవే సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ రహదారిపై హుకుంపేట జైహింద్‌నగర్ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం సమయంలో ఓ ఆయిల్ ట్యాంకర్ నుంచి ఆయిల్ లీకైంది. దీంతో పలువురు వాహనచోదకులు అదుపుతప్పి కిందపడ్డారు. సమాచారం అందుకున్న నేషనల్ హైవే అథారిటీ సిబ్బంది అక్కడకు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దే చర్యలు చేపట్టారు. ఆయిల్ పడిన ప్రాంతంలో ఇసుక వేసి, దానిపై నుంచి వాహనాలు వెళ్లకుండా స్టాప్ బోర్డులు ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆయిల్‌పై వేసిన ఇసుకను, స్టాప్ బోర్డులను తీసేశారు. వాహనాలు రాకపోకలకు అనువుగా మారడంతో వాహన చోదకులు ఊపిరి పీల్చుకున్నారు.

### సూర్యదేవునికి ప్రత్యేక పూజలు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుడికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో రుత్వికులు ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు నిర్వహించారు.

# సుజల ప్రాప్తిరస్తు..

- వర్షపు నీటిని ఒడిసిపట్టి.. రీ సైక్లింగ్
- తొలిసారిగా అన్నవరం దేవస్థానంలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్
- లక్ష లీటర్ల సామర్థ్యంతో ట్యాంక్ నిర్మాణం
- సంతృప్తి వ్యక్తం చేసిన దేవదాయ శాఖ కమిషనర్
- అన్ని దేవస్థానాల్లో నిర్మించాలని ఆదేశం



శివసదన్ సత్రం వద్ద నిర్మించిన రైన్ వాటర్ హార్వెస్టింగ్ ట్యాంక్, సత్రానికి అమర్చిన పైపులైన్

అన్నవరం: ప్రముఖ పుణ్య క్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో సాంకేతిక పరంగా విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వర్షపు నీటిని ఒడిసిపట్టి, ట్యాంకులో నింపి, అదే నీటిని తిరిగి ఉపయోగించుకునే పద్ధతికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుత దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్.. 2023–24 మధ్య అన్నవరం దేవస్థానం ఈఓగా పని చేసినప్పుడు ఈ మేరకు ప్రణాళిక రూపొందించగా.. ఇప్పుడది కార్యరూపం దాల్చుతోంది.

అన్నవరం దేవస్థానంలోని సత్యగిరిపై నిర్మించిన 135 గదుల శివసదన్ సత్రంపై శ్లాబు మీద కురిసిన వర్షపు నీటిని పైపుల ద్వారా సేకరిస్తారు. సత్రం దిగువన నిర్మించిన లక్ష లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకులోకి ఆ నీరు చేరేలా ఏర్పాట్లు చేశారు. ఆ ట్యాంకులో వర్షపు నీరు ఎంత మేర ఉందో తెలిపే మీటరు కూడా ఏర్పాటు చేశారు. ఈ వర్షపు నీటిని ఎప్పటికప్పుడు ఫిల్టర్(శుద్ధి) చేసే ప్రక్రియ కూడా ఈ ట్యాంకులో అమర్చారు. ఈ ట్యాంకు నిండినపుడు ఆ నీటిని మరలా శివసదన్ సత్రం పైన ఉన్న వాటర్ ట్యాంకుకు పంపించేలా మోటార్లు ఏర్పాటు చేశారు. సత్రం ఆవరణలో మొక్కల పెంపకానికీ ఈ నీటిని ఉపయోగించుకునే వీలుంది. రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్‌గా దీనిని పిలుస్తున్నారు.



ట్యాంకును పరిశీలిస్తున్న కమిషనర్ రామచంద్రమోహన్ తదితరులు (ఫైల్)

#### కమిషనర్ సంతృప్తి

గత నెల ఒకటో తేదీన అన్నవరం దేవస్థానానికి విచ్చేసిన దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ ఈ ట్యాంకును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ట్యాంకు నిర్మాణం, ఇతర వివరాలను అన్ని దేవస్థానాలకు పంపాలని ఆదేశించారు. దేవస్థానంలోని హరిహర సదన్, ప్రకాష్ సదన్, న్యూ సీసీ, ఓల్డ్ సీసీ సత్రాల వద్ద కూడా ఇటువంటి వాటర్ ట్యాంకులు నిర్మించి, వర్షపు నీటిని పైపుల ద్వారా మళ్లించి, ఆ నీటిని ఫిల్టర్ చేసి వినియోగించుకునేలా చేయాలని కమిషనర్ నిర్దేశించినట్టు ఈఓ తెలిపారు.

#### రీ సైక్లింగ్‌కు ఏర్పాట్లు చేశాం



దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశాల మేరకు శివసదన్ సత్రం టెర్రస్‌పై కురిసిన లక్ష లీటర్ల వర్షపు నీటిని సేకరించి, నిల్వ చేసే ట్యాంకు నిర్మించాం. ఇందులో నిల్వ అయ్యే నీటిని తిరిగి సత్రం అవసరాలకు, మొక్కల పెంపకానికి ఉపయోగించుకోవచ్చు. దేవదాయ శాఖలో ఈ విధమైన నీటి ట్యాంకు నిర్మించడం ఇదే ప్రథమం. అలాగే దేవస్థానంలో ఐదు చోట్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకేలా ఇంజెక్షన్ వెల్స్ నిర్మించాం. దీనివల్ల భూమిలోకి నీరు ఇంకి, సత్యగిరి, రత్నగిరిల్లో మొక్కలకు సమృద్ధిగా నీరు అందుతుంది.

– వీర్ల సుబ్బారావు, ఈఓ, అన్నవరం దేవస్థానం

#### రూ.20 లక్షల ఖర్చు

ఈ ఏడాది వర్షాలు ఎక్కువగా కురవడంతో ఈ ట్యాంకు దాదాపుగా నిండిపోయింది. దీంతో ఈ నీటిని మరలా వాటర్ ట్యాంక్‌కు పంపడమో.. లేక మొక్కల పెంపకానికి ఉపయోగించడమో చేస్తామని దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు తెలిపారు. ఈ ట్యాంకు, పైపులైన్, ఇతర నిర్మాణాలకు రూ.20 లక్షలకుపైగా ఖర్చు చేశామని వివరించారు. సాధారణంగా లక్ష లీటర్ల నీరు భూమి నుంచి సత్రం పైకి పంపించేందుకు చాలా విద్యుత్ అవసరమవుతుంది. సత్యగిరి కొండ ప్రదేశం కావడంతో బోర్లు వేసే అవకాశమూ తక్కువే. ఈ పరిస్థితుల్లో వర్షాకాలంలో ఎప్పటి కప్పుడు ఈ నీటిని తిరిగి వాటర్ ట్యాంక్‌కు పంపించడం ద్వారా నీటిని సద్వినియోగం చేయడంతోపాటు, విద్యుత్‌నూ ఆదా చేయవచ్చని తెలిపారు.

### అంబాజీపేట కొబ్బరి మార్కెట్



| కొబ్బరి రకం | ధర (రూ.ల్లో) |
|---|---|
| కొత్త కొబ్బరి (క్వింటాల్) | 20,000 – 21,500 |
| కొత్త కొబ్బరి (రెండో రకం) | 10,500 – 12,000 |
| కురిడీ కొబ్బరి (పాతవి) | |
| గండేరా (వెయ్యి) | 29,000 |
| గటగట (వెయ్యి) | 27,000 |
| కురిడీ కొబ్బరి (కొత్తవి) | |
| గండేరా (వెయ్యి) | 28,000 |
| గటగట (వెయ్యి) | 26,000 |
| నీటికాయ | |
| పాత (ముక్కుడు)కాయ (వెయ్యి) | 19,000 – 20,000 |
| కొత్త (పచ్చి)కాయ (వెయ్యి) | 18,000 – 19,000 |
| కొబ్బరి నూనె (15 కిలోలు) | 5,250 |
| కిలో | 350 |

### జూదరుల అరెస్ట్

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలోని కొండపల్లి వారి వీధిలో పేకాట ఆడుతున్న పది మందిని శనివారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్టు పట్టణ సీఐ సురేష్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.66,500 నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

### విద్యార్థిని అదృశ్యం



షెలాశియా(ఫైల్)

రంగంపేట: కళాశాలకంటూ వెళ్లిన విద్యార్థిని అదృశ్యమైనట్టు కేసు నమోదు చేశామని స్థానిక ఎస్సై శివప్రసాద్ తెలిపారు. ఆయన వివరాల మేరకు, రాజానగరం మండలం శ్రీరామపురం గ్రామానికి చెందిన 16 ఏళ్ల నూతలపాటి షెలాశియా రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ఫస్టియర్ చదువుతోంది. ఎప్పటిలాగే శనివారం దివాన్‌చెరువులో ఆర్టీసీ బస్సు ఎక్కి, రంగంపేటలో దిగి కళాశాలకు వెళ్లింది. కళాశాల ముగిశాక సాయంత్రం ఆమె ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆమె తల్లిదండ్రులు తెలిసిన చోట్లా, బంధువుల ఇళ్ల వద్దా ఆచూకీ కోసం యత్నించారు. ఆమె ఆచూకీ తెలియకపోవడంతో.. శనివారం రాత్రి ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు. విద్యార్థిని ఆచూకీ తెలిసిన వారు రంగంపేట పోలీస్ స్టేషన్‌కు, లేదా 94409 04854, 94407 96538 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

### మహిళ మెడలో గొలుసు చోరీ

అయినవిల్లి: గ్రామంలోని సిద్ధి వినాయక ఆలయానికి దర్శనానికి వచ్చిన మహిళ మెడలో బంగారు గొలుసు ఆదివారం చోరీకి గురైంది. వివరాల్లోకి వెళితే, ఆత్రేయపురం మండలం మెర్లపాలెం గ్రామానికి చెందిన కొందరు మహిళలు విఘ్నేశ్వర స్వామివారి దర్శనం చేసుకుని తిరిగి వెళుతున్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైపు రోడ్డులో కాలినడకన వెళుతున్న బందెల చక్ర సునీత మెడలో రూ.నాలుగు లక్షల విలువైన నాలుగు కాసుల బంగారు గొలుసు ఉంది. వెనుక నుంచి మోటార్ బైక్‌పై వచ్చిన దుండగుడు ఆమె మెడలోని గొలుసును లాక్కుని పరారయ్యాడు. ఈ మేరకు బాధితురాలు సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపారు.

### లెక్చరర్ ప్రవర్తనపై విద్యార్థిని కుటుంబ సభ్యుల నిలదీత

అన్నవరం: విద్యార్థినిని వేధిస్తున్నట్టు వచ్చిన ఆరోపణలపై ఓ లెక్చరర్‌ను నిలదీసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక సత్యదేవ డిగ్రీ కళాశాలలో బీకాం ఫైనలియర్ విద్యార్థినికి ఆదే కళాశాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ ఒకరు తరచూ ఫోన్ చేస్తున్నట్టు విద్యార్థిని కుటుంబ సభ్యులు ఆరోపించారు. శనివారం ఉదయం కళాశాలకు వచ్చి వారు లెక్చరర్‌ను నిలదీసి, కళాశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కళాశాల కరస్పాండెంట్, దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావును ఆదివారం వివరణ కోరగా, ఈ విషయం తన దృష్టికి రాలేదన్నారు. ఆ లెక్చరర్ తప్పుగా ప్రవర్తించినట్టు రుజువైతే తప్పక చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## వేదాలతో లోకం సుభిక్షం



ఇందుపల్లిలో వేద సభలో పాల్గొన్న వేద పండితులు

అమలాపురం రూరల్: ఇందుపల్లి అరవగరువు గణపతి మందిరంలో రాణి హయగ్రీవ అవధాని వేదశాస్త్ర పరిషత్, ఆత్రేయ మహర్షి వేదశాస్త్ర పరిషత్ వార్షిక వేదశాస్త్ర మహాసభ జరిగింది. కోనసీమ వ్యాప్తంగా వేద పండితులు పాల్గొని వేదలను ఘోషించారు. వారు మాట్లాడుతూ వేదాలతో లోకం సుభిక్షంగా ఉంటుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన మహోపాధ్యాయ విశ్వనాథ గోపాల కృష్ణ మాట్లాడుతూ వేదాలకు పుట్టినిల్లు కోనసీమ అని అన్నారు. ఇందుపల్లిలో రాణి హయగ్రీవ అవధాని వేదశాస్త్ర పరిషత్, ఆత్రేయ మహర్షి వేద శాస్త్ర పరిషత్ ఆధ్వర్యంలో ఏటా వార్షిక వేదశాస్త్ర మహాసభ నిర్వహించడం అభినందనీయమన్నారు. గుళ్లపల్లి దత్తాత్రేయ ఘనపాఠి, వడ్లమని సుబ్రహ్మణ్య ఘనపాఠి, దువ్వూరి సూర్యప్రకాశ సోమయాజులు, తంగిరాల సుబ్రహ్మణ్య సోమయాజులు తదితరులు వేదాల గొప్పదనం గురించి వివరించారు. బాలభక్త గణపతి సేవా సంఘ అధ్యక్షుడు తాతకాశీ విశ్వనాథ్ స్వాగత ఉపన్యాసం చేశారు. వేద పండితులను పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు కర్ర సోమసుందరం (దత్తు), ముష్టి వెంకట రాజేశ్వరశర్మ సత్కరించారు.

## బాలలతో భిక్షాటన చేయించడం నేరం



వీధి బాలలకు కౌన్సెలింగ్ ఇస్తున్న జిల్లా బాలల సంక్షేమాధికారి వెంకట్రావు

కాకినాడ రూరల్: బాలలతో భిక్షాటన చేయించడం నేరమని జిల్లా బాలల సంక్షేమాధికారి సీహెచ్ వెంకట్రావు అన్నారు. వీధి బాలల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా రమణయ్యపేట గ్రామ శివారు కొత్తూరు వద్ద నలుగురు వీధి బాలలను శనివారం సాయంత్రం గుర్తించారు. బాలల తల్లిదండ్రులు పల్నాడు జిల్లా వినుకొండగా గుర్తించారు. ప్లాస్టిక్ సామగ్రి ఏరుకుంటూ, గ్యాస్ స్టవ్‌ల రిపేరు చేస్తూ జీవనోపాధి పొందుతున్న తల్లిదండ్రులు పిల్లలను భిక్షాటనకు ప్రోత్సహించడంతో వారికి కౌన్సెలింగ్ ఇచ్చినట్టు వెంకట్రావు తెలిపారు.

ఇద్దరు పిల్లలను అంగన్‌వాడీ సెంటరులో, ఒకరిని ఎంపీపీ స్కూల్, మరొకరిని జెడ్పీ స్కూల్‌లో చేర్పామన్నారు. ఐసీడీఎస్ సీడీ లక్ష్మి సహకారంతో వీధి బాలల గుర్తింపు కాకినాడ పరిసరాలలో చేపడుతున్నట్టు తెలిపారు.

### ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి

రాజానగరం: ఆధునిక సమాజంలో జీవన విధానమంతా యాంత్రికమైపోవడంతో చాలా మంది తాము తీసుకునే ఆహారం, ఆరోగ్యంపై శ్రద్ధ చూపలేకపోతున్నారని, ఈ కారణంగా అనారోగ్యాల బారిన పడుతున్నారని ఎండోక్రైన్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఈఎస్ఏపీ) రాష్ట్ర కార్యదర్శి కేఎస్ సుబ్రహ్మణ్యం అన్నారు. దివాన్‌చెరువులో ఆదివారం నిర్వహించిన ఈఎస్ఏపీ వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెడీమేడ్ ఫుడ్‌ల ప్రభావం అనారోగ్య సమస్యలపై ఎక్కువగా ఉంటుందన్నారు. డయాబెటీస్, థైరాయిడ్, ఎముక ఆరోగ్యంపై కూడా సమావేశంలో చర్చించామన్నారు. వైద్యరంగంలో వస్తున్న ఆధునిక మార్పులు, చికిత్స పద్ధతులపై ఈఎస్ఏపీ కార్యనిర్వాహక కార్యదర్శి మిథున్‌చక్రవర్తి చర్చించారు. అనారోగ్య సమస్య వచ్చిన వెంటనే వైద్యుని సంప్రదించి, మందులు వాడాలన్నారు. డాక్టర్ గన్ని భాస్కరరావు, డాక్టర్ ఎంవీ శేఖర్‌రెడ్డి, డాక్టర్ ఎం.రాజేష్, డాక్టర్ టి.రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## మహిళను కాపాడిన కానిస్టేబుల్



వివాహితను కాపాడిన కానిస్టేబుల్ నాగరాజు

ఐ.పోలవరం: గోదావరిలోకి దూకేందుకు ప్రయత్నించిన ఒక మహిళను స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ కాపాడిన సంఘటన మండలంలో జరిగింది. ఆ వివరాల్లోకి వెళ్తే.. యానాం – ఎదుర్లంక వంతెనపై నుంచి గోదావరిలోకి దూకేందుకు యానాం గోపాల్‌నగర్‌కు చెందిన దుర్గ ఆదివారం ప్రయత్నించింది. అటుగా వెళ్తున్న ఎస్‌బీ కానిస్టేబుల్ నాగరాజు గమనించి ఆమెను నలుగురి సాయంతో రక్షించారు. వివరాలు అడిగి తెలుసుకుని.. భర్త, పిల్లలకు సమాచారం అందజేశారు.

కాగా, దుర్గ యానాంలో ఇంటి పనులు చేస్తుండగా, భర్త ఆటోను నడుపుతున్నట్టు తెలిపారు. భార్యాభర్తల మధ్య వివాదమే కారణమని తెలుసుకుని ఆ కుటుంబానికి కౌన్సెలింగ్ ఇచ్చి, బంధువులకు అప్పగించారు. తక్షణమే స్పందించిన నాగరాజును స్థానికులతో పాటు, పోలీసులు అభినందించారు.

## ఇరు వర్గాల మధ్య ఘర్షణ

- కోడి కత్తులతో దాడిలో ఇద్దరికి తీవ్ర గాయాలు
- గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఘటన

గోకవరం: ఏజెన్సీ ప్రాంతంలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు, గంగవరం మండలం ఓజుబంద గ్రామానికి చెందిన కొందరు గణేశ్ విగ్రహ నిమజ్జనం కోసం గోకవరం మండల పరిధి మీదుగా రంపచోడవరం వైపు వెళుతున్నారు. ఈ క్రమంలో రామన్నపాలెం శివారున గోకవరానికి చెందిన ఆరుగురు ఈ ఊరేగింపునకు ఎదురయ్యారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో గోకవరానికి చెందిన ఆరుగురు కోడి కత్తులతో దాడి చేశారు. ఈ ఘటనలో ఓజుబందకు చెందిన భరత్‌కుమార్, రాజేష్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. తొలుత వీరిని గోకవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యానికి రాజమహేంద్రవరం తరలించారు. దీనిపై గోకవరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

## విలక్షణానికి ప్రతీకలు ముగ్గురు తల్లులు

- శతావధాని డాక్టర్ బులుసు అపర్ణ
- సదనంలో సరస్వతీ సపర్యా మహోత్సవాలు



డాక్టర్ అపర్ణను సత్కరిస్తున్న కళాశాల అధ్యాపకులు

సీటీఆర్ఐ: కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన రామాయణ కల్పవృక్షంలో ముగ్గురు తల్లులు మూడు రకాల స్వభావాలకు ప్రతీకలుగా నిలుస్తారని శతావధాని డాక్టర్ బులుసు అపర్ణ అన్నారు. ఆంధ్రయువతీ సంస్కృత కళాశాలలో జరుగుతున్న సరస్వతీ సపర్యా మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రామాయణ కల్పవృక్షంలో ముగ్గురు తల్లులు అయిన కౌసల్య, సుమిత్ర, కైకేయిలపై ప్రసంగించారు. వారి విలక్షణ స్వభావాలను వివరిస్తూ విశ్వనాథ అనేక విశేషణాలను వాడారని అన్నారు. కైకకు రాముడిపై అపరిమిత వాత్సల్యం ఉండేదని, రాముడికి బాల్యంలో విలువిద్య నేర్పింది కైకయేనన్నారు. తదనంతర కాలంలో రాముడి వనవాసాన్ని కోరిన కారణంగా పైకి మంథర దుర్బోధగా కనపడినా, అసలు కారణం దైవ ప్రేరణగా భావించాలని వివరించారు. నన్ను సవతి తల్లిని చేశావు.. అని రామునితో కైక అన్న మాటల్లో ఆమె క్రోధం కన్నా, బాధ ఎక్కువగా ధ్వనిస్తుందని విశదీకరించారు. విశ్వనాథ రామాయణ కల్పవృక్షం సర్వలక్ష్య సంగ్రహం, వ్యాకరణ, ఛంద ప్రయోగాల్లో ఆయన వివిధ రకాల ప్రయోగాలను చేశారన్నారు. నా భక్తి రచనలు నావిగాన.. అని చెప్పుకొన్న ధీశాలి విశ్వనాథ అని కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.అన్నపూర్ణ మాట్లాడుతూ, ప్రాచీన కవుల మూల గ్రంథాలను అనువదించేటప్పుడు తర్వాత తరం కవులు స్వతంత్ర ధోరణులు అవలంబించడం, మూలంలోని అంశాలను విస్తరించడం, పరిహరించడం పరిపాటి అన్నారు. కళాశాల అధ్యాపకులు సత్యశిరీష, శ్రీదేవి, శేషకుమారి తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు డాక్టర్ బులుసు అపర్ణను ఘనంగా సత్కరించారు. సోమవారం అవధాన శేఖర రాంభట్ల పార్వతీశ్వర శర్మ ప్రబంధ కవుల సరస్వతీ సపర్య అనే అంశంపై ప్రసంగిస్తారు.



### రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రంపచోడవరం: మారేడుమిల్లి మండలం సున్నంపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదివారం ఓ యువకుడు మృతి చెందాడు. తూర్పు గోదావరి జిల్లా బొబ్బిల్లంక గ్రామానికి చెందిన మర్రిరెడ్డి ఫణీంద్ర(37)గా గుర్తించారు. విహార యాత్రకు మారేడుమిల్లికి మోటార్ బైక్‌పై వచ్చి.. తిరిగి వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన లారీని ఢీకొట్టడంతో ఫణీంద్ర సంఘటన స్థలంలోనే మరణించాడు. అతని బైక్‌పై ఉన్న మరో యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

### దేవాలయ భూముల్లో చెట్ల నరికివేత!



చెట్లు నరికివేసిన ప్రాంతంలో దుంగలు

కొత్తపల్లి: మండలంలోని గోర్స గ్రామానికి చెందిన పురాతన సీతారామ స్వామి దేవాలయ భూముల గట్లపై ఉన్న చెట్ల నరికివేత చర్యలను ఆదివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ భూముల్లో ఎటువంటి వ్యవసాయ పనులు చేపట్టరాదని న్యాయస్థానం ఉత్తర్వులు ఉన్నట్టు గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల ప్రకారం, కొమరగిరి గ్రామంలో సర్వే నంబరు 121, 122లో గోర్స దేవాలయానికి సుమారు 20 ఎకరాల భూమి ఉంది. దీనిపై ఆక్రమణదారులు, దేవదాయ శాఖ మధ్య వివాదం న్యాయస్థానంలో ఉంది. ఇలాఉంటే ఆక్రమణదారులు ఇందులో వ్యవసాయ పనులు చేపట్టేందుకు ఆదివారం సిద్ధమయ్యారు. గట్టుపై చెట్లను నరికించడంతో.. సర్పంచ్ రొంగల వీరబాబు ఆధ్వర్యంలో గ్రామస్తులు అడ్డుకుని, తహసీల్దార్ చిన్నారావుకు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు వీఆర్వో కిషోర్ ఆక్రమణదారులు, చెట్లను నరికిన వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తామని ఎస్సై వెంకటేష్ తెలిపారు.

## పెట్టుబడి పెన్షన్.. బతుకు టెన్షన్

- 'ఉమ్మడి'లో 30 వేల సీపీఎస్ ఉద్యోగులు
- నేడు విజయవాడలో మహా సభ



రాయవరం: ప్రభుత్వ ఉద్యోగులకు ప్రస్తుతం ఇబ్బందులు తలెత్తాయి. ఉద్యోగ విరమణ తర్వాత ఆర్థిక భద్రత, విధి నిర్వహణలో చనిపోతే కుటుంబానికి తోడ్పాటు, ఆర్థిక ప్రయోజనాలు, ఉద్యోగికి సామాజిక భద్రతగా పెన్షన్ ఉంటుందనేది ఒకప్పటి మాట. సీపీఎస్ ఉద్యోగులకు మాత్రం ఈ మేరకు భవిష్యత్తుపై భరోసా లేకపోవడంతో.. పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలనే డిమాండ్ దశాబ్దకాలంగా వినిపిస్తోంది. సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు చేస్తున్న పోరాటానికి వివిధ ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక(ఫ్యాప్టో) ఇప్పటికే మద్దతు పలికింది.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సచివాలయ ఉద్యోగులు కలిపి 30 వేల మంది సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులున్నారు. పదవీ విరమణ అనంతరం అందించే పింఛన్లు భారమవుతుందని భావించి 2003–04 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు న్యూ పెన్షన్ స్కీమ్(ఎన్‌పీఎస్) విధానం అమలు చేశారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్) పేరుతో అమల్లోకి తీసుకొచ్చింది. 2004 సెప్టెంబర్ ఒకటి నుంచి సీపీఎస్ విధానాన్ని అమలు చేస్తున్నారు. దీనిని ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఏటా సెప్టెంబర్ ఒకటిన పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తున్నారు.

#### నేడు విజయవాడలో మహాసభ

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలనే డిమాండ్‌తో సీపీఎస్ ఉద్యోగులు సోమవారం విజయవాడలో ధర్నా చౌక్ వద్ద మహాసభ నిర్వహిస్తున్నారు. ఈ మహాసభలకు వెళ్లే వారిపై ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తున్నాయి. ఉమ్మడి జిల్లా నుంచి ఐదు వేల మంది తరలి వెళ్లేందుకు సిద్ధమయ్యారు.

#### మాట నిలబెట్టుకోవాలి



సీపీఎస్ ఉద్యోగుల పోరాటం ద్వారా గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ సాధించుకున్నాం. ప్రభుత్వ ఉద్యోగి హక్కుగా ఉన్న సర్వీస్ పెన్షన్ సాధించుకోవడమే లక్ష్యంగా, కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకునే వరకూ మా పోరాటాన్ని దశలవారీగా ఉధృతం చేస్తాం.

– చింతా నారాయణమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఏపీసీపీఎస్ఈఏ, కాకినాడ

#### తీవ్రంగా నష్టపోతున్నాం



సీపీఎస్ విధానం కారణంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఉద్యోగికి ప్రాథమిక హక్కులైన పెన్షన్, సామాజిక, ఆర్థిక భద్రత లేని సీపీఎస్ విధానం వల్ల రోడ్డున పడే దుస్థితి ఏర్పడింది.

– గుబ్బల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిలర్, ఏపీసీపీఎస్ఈఏ అసోసియేషన్, అంతర్వేది, సఖినేటిపల్లి మండలం